

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 06 ఆగష్టు 2025 పేజీలు : 04


## బొప్పేపల్లి చెరువుకు నీటిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



చల్లా రాజేంద్ర ప్రసాద్

- ఫలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కృషి - సీఎం దృష్టికి తీసుకెళ్లిన చల్ల రాజేంద్ర ప్రసాద్

**అనంతపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త బ్యూరో**

శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలంలోని బొప్పేపల్లి చెరువుకు 0.100టీఎంసీల నీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని పలు గ్రామాలకు బోర్లలో నీరు రీచార్జ్ అవుతుందని తద్వారా పండ్ల తోటలకు ఎంతో మేలు చేకూరుతుందని రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. బొప్పేపల్లి చెరువుకు పులివెందుల రబాంచ్ కెనాల్‌లో నీటి పొదుపు ద్వారా, హెచ్ఎన్ఎస్ఎస్ వ్యవస్థ నుంచి 0.100 టీఎంసీల నీటిని కేటాయించాలని నీటి పారుదల శాఖ అధికారులు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బొప్పేపల్లి చెరువుకు నీరు కేటాయించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చేసిన కృషి ఫలించింది. అదే విధంగా కాపి బోర్డు సభ్యునిగా మూడు పర్యాయాలు పని చేసిన చల్లా రాజేంద్ర ప్రసాద్ కూడా ఈ విషయంలో గట్టి ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. చల్లా రాజేంద్ర ప్రసాద్ స్వగ్రామం కూడా ఆ ప్రాంతంలో ఉండటంతో రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబునాయుడు, ఇతర ప్రభుత్వ పెద్దలకు సమస్యను తీసుకెళ్లడంలో ఆయన కూడా గట్టి ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కాపి బోర్డు మాజీ సభ్యులు చల్లా రాజేంద్రప్రసాద్ కృషితో తమకు న్యాయం జరిగిందని యల్లనూరు, పుట్లూరు మండలాలకు చెందిన రైతులు అభిప్రాయ పడుతున్నారు.

## ప్రముఖ న్యాయవాది ఆదిశేషారెడ్డి మృతి

- ఆత్మీయుల కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు పూర్తి
- ఘనంగా న్యాయవాదుల నివాళులు

**అనంతపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త బ్యూరో**



న్యాయవాది ఆదిశేషారెడ్డి (ఫైల్‌ఫోటో)

ప్రముఖ సీనియర్ న్యాయవాది పి.ఆదిశేషారెడ్డి(69) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ కన్ను మూశారు. కూడేరు మండలం మరుట్ల-2 కాలనీలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో మంగళ వారం సాయంత్రం బంధువులు, స్నేహితులు, న్యాయవాదులు, అభిమానులు, విషాధఛాయల మధ్య ఆదిశేషారెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతపురం బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షునిగా పని చేసిన ఆదిశేషారెడ్డి ఎందరో యువ న్యాయవాదులకు స్ఫూర్తిగా నిలిచి విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగిస్తూ న్యాయవాది వృత్తిలో కొనసాగారు. సివిల్, క్రిమినల్, పొలిటికల్ కేసుల్లో ఆదిశేషారెడ్డి వాదించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆర్టిసి తరుపున స్టాండింగ్ కౌన్సిల్‌కు న్యాయవాదిగా కూడా పని చేశారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర హత్య కేసులో కీలకంగా ఉన్న మద్దెల చెరువు సూర్యనారాయణరెడ్డి తరుపున ఆది శేషారెడ్డి కేసుల్లో వాదించారు. మిస్సమ్మ బంగ్లా వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరెడ్డి కుటుంబం తరుపున వాదించారు. తన జీవితంలో యువ న్యాయవాదులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందిస్తూ ఆదిశేషారెడ్డి మార్గదర్శిగా నిలిచారని న్యాయవాదులు చెబుతుంటారు. మాజీ ఎంపి దివంగత అనంత వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి తదితరులకు సన్నిహితంగా ఉండేవారు. కాగా ప్రముఖ న్యాయవాది ఆదిశేషారెడ్డి మృత దేహానికి పలువురు న్యాయవాదులు, రాజకీయ నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. న్యాయవాదుల్లో అనంతపురం బార్ అసోషియేషన్ అధ్యక్షులు గురు ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు డి.విజయ్‌కుమార్, ఎన్ఆర్‌కె మోహన్, లక్ష్మాచారి, అబ్దుల్ రసూల్, ఆర్.హరినాథ్‌రెడ్డి, అవ్వా నరేష్‌తోపాటు లక్ష్మినారాయణ, జూటూరు సుధాకర్‌రెడ్డి, కెవి.రమేష్, ప్రకాష్‌రెడ్డి తదితర న్యాయవాదులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. వైసిపి జిల్లా నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, బి.ఎరిస్వామిరెడ్డి తదితర రాజకీయ నాయకులు కూడా ఆదిశేషారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా న్యాయవాది ఆదిశేషారెడ్డి మృతికి సంతాపకంగా అనంతపురంలో కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఆదిశేషారెడ్డికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలిగి ఉన్నారు.

## జన సందోహం నడుమ అట్టహాసంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు జన్మదిన వేడుకలు

- గిరిజనులతో కలిసి సాంప్రదాయ నృత్యాలు - మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం - విద్యార్థులకు క్రికెట్ కిట్ల పంపిణీ
- పట్టణంలోని ప్రతి ప్రధాన కూడలిలో భారీ కేక్ కటింగ్ - నియోజకవర్గ వ్యాప్తంగా వాడ వాడల తరలివచ్చిన టిడిపి నాయకులు కార్యకర్తలు









కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు జన్మదిన వేడుకల దృశ్యాలు

**కళ్యాణదుర్గం, ఆగస్టు 5 ప్రభాతవార్త:**

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు 59వ జన్మదిన వేడుకలు అడుగడుగునా అభినందనలతో, అభిమానంతో కదిలి వచ్చిన కార్యకర్తలు ప్రజల జన సందోహం నడుమ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు తన జన్మదినాన్ని ఒక మారుమూల ప్రాంతంలోని నుసి కొట్టాల తండాలో గిరిజన మహిళల మధ్య సాంప్రదాయ నృత్యాలు చేస్తూ పేదల మధ్య తన జన్మదినాన్ని జరుపుకోవడం పట్ల ఆయన పేదల పట్ల ఉన్న అభిమానానికి అద్దం పట్టింది. ఫ్లోరైడ్ నీటితో అవస్థలు పడుతున్న గిరిజనుల కోసం సొంత నిధులతో రక్షిత మంచినీటి మినరల్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పేదల గుడిసెల్లో గిరిజనులతో కలిసి వారి బాగోగులను విచారించి, అవసరమైన వారికి తానున్నానని భరోసా ఇచ్చారు. అనంతరం భారీ కాన్వాయ్ తో కళ్యాణదుర్గం చేరుకొని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నిలువెత్తు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక టీ సర్కిల్లో మైనార్టీల ఆధ్వర్యంలో భారీ జన్మదిన కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అక్కడినుండి గాంధీ చౌక్ వెళ్లగా అక్కడ ఆర్యవైశ్యులు శాలువలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాల్మీకి సర్కిల్లో వాల్మీకి మహర్షికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి వాల్మీకి సామాజిక వర్గంతో కలసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తండోపతండాలుగా వచ్చిన టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు నడుమ ప్రత్యేక వేదికపై జన్మదిన కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజా వేదికలో తమ అభిమాన ఎమ్మెల్యే సురేంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పడానికి జనం క్యూ కట్టారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు నోటు పుస్తకాలతో ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎస్ఆర్సి డెవలపర్స్ కంపెనీ తరఫున ఎమ్మెల్యే తనయుడు యశ్వంత్,మేనల్లుడు అవినాష్, వెంకటేశులు తదితరుల చేతుల మీదుగా క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఉదయం నుండి సాయంత్రం దాకా జన్మదిన వేడుకలలో అలుపెరుగని నాయకుడిగా ఎమ్మెల్యే అందరిని చిరునవ్వుతో పలకరించడమే కాకుండా వారితో ఫోటోలు దిగడం అందరినీ అలరించింది.

## సైబర్ నేరాలు పట్ల కస్టమర్లను అప్రమత్తం చేయడంలో బ్యాంకర్ల పాత్రపై సమావేశం

- బ్యాంకు అధికారులతో జిల్లా ఎస్పీ జగదీష్ సమావేశం





బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ జగదీష్



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 5 ప్రభాతవార్త**

జిల్లాలోని బ్యాంకులు, ఏటిఎం కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు... ప్రజలు సైబర్ మోసగాళ్ల బారినపడకుండా ఉండటంలో బ్యాంకర్లు ఎలాంటి ముందస్తు అవగాహన చర్యలు తీసుకోవాలి, తదితర అంశాలపై సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ . స్థానిక పోలీసు సమావేశ భవనంలో మంగళవారం బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.

ఆర్.బి.ఐ గైడ్లెన్స్ ప్రకారం ప్రతి బ్యాంక్ మరియు ఏటీఎంల వద్ద నిర్దేశిత భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలి. ప్రతి బ్యాంకు అధికారులు మీ బ్యాంకు ప్రవేశ/ నిష్క్రమణ మార్గాలు, చుట్టుపక్కల పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీటీవీ కెమెరాలు అమర్చుకోవాలి. ఏటీఎం సెంటర్ల వద్ద 24 గంటలు పనిచేసే రికార్డు అయ్యి దృశ్యం క్లారిటీగా కనపడేలా అత్యాధునిక హెచ్ డి కెమెరాలను అమర్చడమే కాకుండా వాటి డేటా క్లౌడ్ స్టోరేజ్ లో నిక్షిప్తం చేసుకునేలా చర్యలు చేపట్టాలి. బ్యాంకు విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది మరియు అవుట్‌సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. మీ బ్యాంక్ నందు అత్యవసర ఫోన్ కాల్ నెంబర్లు మరియు సైబర్ క్రైమ్ కు సంబందించిన హెల్ప్ లైన్ నెంబర్లను స్పష్టంగా బ్యాంకులో ప్రదర్శించాలి. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి బ్యాంకు అధికారులను సంప్రదించి నప్పుడు తక్షణ సహాయం కొరకు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం తెలియజేయాలి. 1930/ఎన్సీఆర్పీ పోర్టల్ నందు కంప్లైంట్ చేయించిన తరువాత మాత్రమే పోలీసువారిని సంప్రదించమని చెప్పాలి. సైబర్ నేరం జరిగిన తక్షణమే సదరు టోల్ ఫ్రీ నంబర్ కు గోల్డెన్ హవర్ లో కంప్లైంట్ చేయిస్తే తగు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం... ప్రజలు సైబర్ నేరాలలో ఇరుక్కోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పోలీసుశాఖ తయారు చేసిన పోస్టర్లను బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులతో కలసి ఆవిష్కరించారు ఈ సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు, డీఎస్పీలు మహబూబ్ బాషా, వి.శ్రీనివాసరావు, జిల్లా స్పెషల్ బ్రాంచి మరియు సైబర్ సెల్,డీసిఆర్బీ, సిసిఎస్ సి.ఐ లు ధరణీకిశోర్, క్రాంతికుమార్, షేక్ జాకీర్, హరినాథ్ , వలీబాషా, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ తో పాటు జిల్లాలోని 35 బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## హాస్టల్స్‌లో అడ్మిషన్లు పెరిగాయ్...!

- గత ఏడాది 12028, ఈ ఏడాది 13557 అడ్మిషన్లు
- రూ.కోట్లు రుపాయిలతో మౌళిక వసతులు ఏర్పాటు -ముందే మెల్కొల్పిన వార్త కథనం






అనంతపురం పట్టణంలో ఎస్సీ, బీసీ గర్ల్స్ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో అడ్మిషన్లు లేవు అనే బోర్డులు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త**

గత ఎడాది కంటే ఈ ఎడాది హాస్టల్స్‌లో అడ్మిషన్లు పెరిగాయి. గత ఎడాది అడ్మిషన్లు తగ్గడంపై వేసవి సెలవుల్లోనే వార్త కథనం ద్వారా సంక్షేమ శాఖల అధికారులు, వార్డెన్లను అప్రమత్తం చేయడం జరిగింది. దీంతో ఈ ఎడాది అడ్మిషన్లను పెంచారు.

అనంతపురం జిల్లాలో గత విద్యా సంవత్సరంలో ఎస్సీ-51 హాస్టల్స్‌లో 4798 అడ్మిషన్లు, బీసీ-55 హాస్టల్స్‌లో 7230 అడ్మిషన్లు, మొత్తం 12028 అడ్మిషన్లు జరిగాయి. అయితే ప్రతి హాస్టల్‌కు వంద అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే గత విద్యా సంవత్సరంలో కొందరు వార్డెన్ల నిర్లక్ష్యం వలన చాలా హాస్టల్స్‌లో వంద, 50 లోపు అడ్మిషన్లు జరిగాయి. హాస్టల్స్‌లో వసతి పొందుతున్న విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌళిక వసతులు కల్పించడంపై జిల్లా కలెక్టర్ డా.వి.వినోద్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అందుకు వెంటనే స్పందించి ఎస్సీ హాస్టల్స్ మరుమత్తులకు రూ.7.2 కోట్లు, బీసీ హాస్టల్స్‌కు రూ.7.75 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ప్రభుత్వ భవనాల్లో ఉన్న హాస్టల్స్‌లో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌళిక వసతులను కల్పించడానికి పనులు ప్రారంభించారు. ఆ పనులు చాలా హాస్టల్స్‌లో వంద శాతం పూర్తి కావడంతో హాస్టల్స్ రూపరేఖలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ ఎడాది మే 24న వార్త దినపత్రికలో ఈసారైనా హాస్టల్స్‌లో అడ్మిషన్లు పెరిగేనా? అనే శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. ఇందుకు ఆయా సంక్షేమ శాఖల జిల్లా, డివిజన్ అధికారులు, వార్డెన్లు అప్రమత్తం అయ్యి మెల్కొన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్లపై ప్రచారం నిర్వహించారు. కొన్ని హాస్టల్స్‌లో వంద లోపే అడ్మిషన్లు ఉన్నాయి. మిగిలిన చాలా హాస్టల్స్‌లో ప్రభుత్వ అనుమతి ఇచ్చిన అడ్మిషన్ల సంఖ్య కంటే ఎక్కువ అడ్మిషన్లు జరిగాయి. చాలా హాస్టల్స్‌లో అడ్మిషన్లు ఫుల్, సీట్లు లేవు అనే బోర్డులు కూడా పెట్టడం జరిగింది. అలా మొత్తం అడ్మిషన్లను కలిపితే ఆగస్టు 5వ తేదీ నాటికి 13557 అడ్మిషన్లు జరిగాయి. గత ఎడాది కంటే ఈ ఎడాది 1529 అడ్మిషన్లను అదనంగా పెంచారు.

### విద్యార్థుల సంక్షేమం :

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో వసతి పొందుతూ చదువుతున్న ఒక విద్యార్థికి నెలకు రూ.1400 నుండి రూ.1600లు వరకు డైట్ చార్జెస్ చెల్లిస్తుంది. ఆ డైట్ చార్జెస్‌తో విద్యార్థులకు వారములో మూడు రోజులు చికెన్ (ఆదివారం మధ్యాహ్నం చికెన్ బిరియాని ), ఉదయం అల్పాహారం, సాయంత్రం 4:30 గంటలకు స్నాక్స్, ప్రతి రోజు ఉదయం 7 గంటలకు పాలు, 8:30 గంటలకు వేరుశనగ చిక్కి, రాత్రి పూట భోజనం తర్వాత అరటిపండు, ఇచ్చేలా మెనూ తయారు చేసి అమలు చేస్తున్నారు. అంతే కాకుండా కాస్మోటిక్స్ కోసం ఒక విద్యార్థికి నెలకు రూ.175 నుండి రూ.250 వరకు చెల్లిస్తుంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి నెల వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. అలాగే రెండు నెలలకు ఒక సారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా పదో తరగతి విద్యార్థుల నాలుగు సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ట్యూటర్లను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ప్రభుత్వం విద్యార్థుల భద్రత కోసం ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. విద్యార్థులపై వార్డెన్లు, డివిజన్, జిల్లా అధికారుల పర్యవేక్షణ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.

### అడ్మిషన్లు పెరగడం సంతోషంగా ఉంది: ఎస్సీ, బీసీ డీడీ ఖుష్బూ కొఠారి

జిల్లాలో గత ఎడాది ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో 12028 అడ్మిషన్లు జరిగాయి. ఈ ఎడాది 13557 అడ్మిషన్లు జరిగాయి. ఈసారి 1529 అడ్మిషన్లు పెరగడం సంతోషంగా ఉంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ భవనాల్లో ఉన్న ఎస్సీ,బీసీ హాస్టల్స్‌లో రూ.14.73 కోట్లతో మరమత్తులు చేసి విద్యార్థులకు వసతులు కల్పించాము. విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము

## ఆర్టీసి ఆస్తులు కాపాడుకోవడానికి సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి

- ఆర్టీసి స్థలాన్ని 'లులూ షాపింగ్ మాల్'కు కేటాయిస్తూ జిఓ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం - ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

**అనంతపురం, ఆగస్టు05 ప్రభాతవార్త**

ఆర్టీసి ఆస్తులు కాపాడుకోవాడానికి సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమాల్లో భాగస్వామలై పోరాడాల్సిన అవసరం ఆసన్నమైందని ఆర్టీసి ఎంప్లాయిూస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.ఎస్. ఖాన్ పిలుపునిచ్చాడు. మంగళవారం స్థానిక క్రిష్ణకళామందిర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఆ యూనియన్ అధ్యక్షుడు ఆర్.వి.రెడ్డి లు మాట్లాడుతూ ప్రజా రవాణా సంస్థ(ఆర్టీసి) సుధీర్ఘ కాలంగా కాపాడుకొస్తున్న ప్రస్తుత భారీ విలువైన ఆస్తులను విజయవాడ నగర నడిబొడ్డును 'లాలూ షాపింగ్ మాల్'కు కేటా యిస్తూ ప్రభుత్వం జి.ఓ.నం.137 జారీ చేసిందని తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసి ఆస్తులు ప్రవేటు వ్యాపారస్థులకు ధారాదత్తం చేస్తున్న చర్యలను వారు తీవ్రంగా ఖండించారు. విజయవాడ నగరనడిబొడ్డున వున్న ఎపిఎస్ఆర్టీసి గవర్నర్‌పేట 1వ, 2వ డిపోలతో పాటు పాత బస్టాండుకు సంబంధించి 4ఎకరాలా 15 సెంట్లు స్థలం దాదాపు 4వందల కోట్ల రూపాయలు విలువ చేస్తుందన్నారు. ఈ విలువైన స్థలాన్ని ప్రభుత్వం లాలూ షాపింగ్ మాల్‌కు అప్పజెప్పడం దుర్మార్గమైన చర్యగా వారు అభి వర్ణించారు. కొన్ని దశాబ్ధాలుగా ఈ రెండు డిపోలు ప్రజలకు రవాణా సౌక ర్యం అందిస్తోందని, ఈ డిపోల్లో 200 బస్సులను 1100 మంది ఉద్యో గులను ప్రజలకు దూరం చేస్తూ బడా పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తూ చేస్తూ జివోను విడుదల చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈగవర్నర్‌పేట రెండు డిపోలు, బస్టాండు స్థలాన్ని 1959లో అప్పటి నిర్ధేశి ంచిన ధర గజం రూ.16లతో దాదాపు 4లక్షల 6వేల రూపాయలకు ఆర్టీసి యాజమాన్యం కొనుగోలు చేసిందన్నారు. ప్రస్తుతం కోట్లాది రూపా యలు విలువ చేస్తే స్థలాన్ని బడా వ్యాపారవేత్తలకు అప్పజెప్పడానికి జిఓ జారీ చేయడం హేయమైన చర్యగా వారు అభివర్ణిం చారు. ప్రభుత్వం నవ్యాంధ్ర ప్రదేశ్ గా అభివృద్ధి చేస్తోందని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసో ందని, ఇదే కంపెనీకి నగర శివారుల్లో కేటాయిస్తే శివారు ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని వారు హితవు పలికారు. అలాకాకుండా నగర నడిబొడ్డున అభివృద్ధి చెందిన బస్టాండుల్లో, నిరంతరం రద్దీగా వుంటూ రోజుకు 43 లక్షల మంది ప్రయాణికులను చేరవేస్తున్న వాటిని ప్రవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి సన్నాహాలు చేయడం దారుణమన్నారు. గతంలో ఈ ప్రభుత్వ పెద్దలే 2014లో విజయవాడ ఆర్టీసి ట్రైనింగ్ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్.ఇ.యల్. కంపెనీకి కట్టపెట్టిందన్నారు. అందుకు బదులుగా ప్రభుత్వం ఇస్తామన్న స్థలం ఇప్పటివరకు ఒక్క గజం కూడా ఇవ్వలేదని వారు గగ్గోలు పెట్టారు. అదేవిధంగా ఇదే గవర్నర్‌పేట 1,2 డిపోలు బఫర్‌జోన్ కాలువ గట్టుపై ఉన్నాయని ఇంటర్ నేషన్ పార్కుగా అభివృద్ధి చేస్తామంటే అప్పట్లో ఆర్టీసిలో వున్న యూనియన్లు ఐక్యంగా ఉద్యమించి అడ్డుకున్నామన్న విష యం వారు గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఉద్యోగులందరూ ఆర్టీసిలో కృషి చేశామని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా ఉద్యోగులకు అమలు చేసిన పాపాన పోలేదని, దశాబ్ధాలుగా ప్రజలకు ఉత్తమ సవలు అందించిన రవాణా సంస్థను నిర్వీర్యం చేయడానికి చర్యలు తీసుకోవడం చాలా దారుణమైన చర్యగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సుధీర్ఘ చరిత్ర కల్గిన ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసి) పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను అమలు చేయాలని లేకుంటే రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లాల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలు ఎండగట్టడానికి తమదైన శైలిలో ప్రజలను కలుపుకుని ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. అలాగే ఈ నెల 15 నుంచి 65లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ద్వారా సేవలందిస్తోందని, ఇలాంటి సంస్థను నిర్వీ ర్యం చేయడానికి ప్రయత్నిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంక్షేమం కోసం ఉద్యమించే పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు, ఇతర ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి భవిష్యత్‌లో ఆందోళనలు తీవ్రతరం చేసి ప్రజా ఆస్తులైన ఆర్టీసి ఆస్తులను కాపాడుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ నాయకులు ఎస్.రామకృష్ణ, సి.వి.పి. ఓబుల రత్నం, కె.కుళ్లాయప్ప, కె.రఫీ తదితరులు పాల్గొన్నారు.


4 >>

అధికారులు ఆడిందే ఆట..పాడిందే పాట..!

కూటమి పాలనలో అన్నదాతకు వాతలు..సుఖీభవకు కోతలు..!

రైతన్నలకు ఇచ్చిన హామీల అమలులో అగ్రగన్యుడు సీఎం చంద్రబాబు

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేయండి

## ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు బిగింపు వద్దు,

### ..పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

కనేకల్లు ఆగస్టు 05 ప్రభాతవార్త



విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

నివాస ఇల్లులకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని స్థానిక విద్యుత్ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కోరి నాగరాజు మాట్లాడుతూ. ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా ఆదానీ విద్యుత్ స్మార్టు మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు ఒప్పందాలు చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను కట్టబెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడింది అన్నారు. అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని మీకు గుర్తు చేస్తున్నాము అన్నారు. ఆనాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన మీరు, ఈనాడు మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వటంతోపాటు, స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయకుండా వాటిని కొనసాగించడం రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం చేయడమే అవుతుంది. విద్యుత్ భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. కానీ, సంవత్సరంలో రూ. 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీలను అదనంగా మోపారు. ఇప్పుడు మరో రూ.12,700 కోట్లు భారం వేయడానికి సిద్ధం చేసింది. మొత్తం 4రకాల సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్.పి.పి.సి.ఎ) వసూలు చేస్తున్నారు అన్నారు. దీనితో బిల్లులు అధికంగా వస్తున్నాయి. స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం షాపులు, చిన్నపరిశ్రమలు రెండు, మూడు రెట్లు, కొందరికి 10రెట్లు ఛార్జీలు పెరిగాయి. మరో రూ.842 కోట్ల భారాలు మోపడానికి ఈఆర్సి ప్రభుత్వాన్ని అనుమతి కోరింది అన్నారు. అందుకే ఆదానీ స్మార్ట్‌మీటర్లు, విద్యుత్ వినియోగదారు లకునష్టం. సోలార్ విద్యుత్ఒప్పందాలను రద్దుచేయాలని కోరుతున్నాము. ఇళ్ళకు స్మార్ట్ మీటర్ బిగించడాన్ని ఆపాలి. పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్‌పద్ధతినే అమలుచేయాలని, గృహాలకు స్మార్టుమీటర్లు పెట్టవద్దని, షాపులు, సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు కాకడి సర్మాసు మహబూబ్ బాషా పక్రుద్దీన్ రామాంజి తదితరులు పాల్గొన్నారు

## కురిసిన వాన మురిసిన అన్నదాత

డి. హిరెహాళ్ ఆగస్టు 5 ప్రభాతవార్త



వరద నీటితో ఉధృతంగా డి.హిరెహాళ్ పెద్ద వంక



వర్షం రాకతో కళకళలాడుతున్న పత్తి పంట

వరుణుడి కరుణతో గత మూడు నెలలుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు వర్షం రాకతో అంతులేని ఆనందంతో మురిసిపోయారు. మంగళవారం వేకువ జామున డి. హిరెహాళ్ మండలంలో విస్తారంగా వర్షం కురవడంతో వంకలు వాగులు పోటెత్తాయి. మండలంలో 58.2 ఎంఎం వర్షపాతం నమోదుకాగా మండలంలోని పలు వాగులకు నిర్మించిన చెక్ డ్యామ్ లు పూర్తిస్థాయిలో నిండి ప్రవహించగా ఓ మోస్తారు లో చెరువులకు వరద నీరు చేరింది. ఈ వర్షం రాకతో ముంగారులో విత్తిన బోకడ రకం పత్తి, బోరు బావుల కింద సాగు చేసిన ప్రధాన వాణిజ్య పంట పత్తి, వర్షాధారంగా సాగుచేసిన మరో వాణిజ్య పంట వేరుశనగ తదితర పంటలు ప్రాణం పోసుకున్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అడుగంటుతున్న బోరుబావులకు వాన రాకతో చెక్ డ్యామ్ లు, చెరువులకు వరద నీరు చేరడంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని మరో రెండు ఇలాంటి వర్షాలు కురిస్తే మరో రెండేళ్ల బోరు బావుల్లో భూగర్భ జలాలకు కొరతుండదని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా వేరుశనగ సాగు చేయకుండా వర్షం కోసం ఎదురుచూస్తున్న పలువురు అన్నదాతలు విత్తనం సాగులో నిమగ్నమై మూడు రోజుల్లో విత్తనం సాగు పూర్తి చేస్తామని అన్నదాతలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సోమలాపురం, పులకుర్తి, హిర్దెహాల్ గ్రామాల వద్ద ఉన్న వంకలు, వాగులు వరద నీటితో ఉరకలేస్తుండడంతో ఇటు రాయదుర్గం నుండి ఆటో బళ్ళారి నుండి ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు వాగులు దాటేందుకు కొంత సమయం వేచి ఉండక తప్పలేదు.

## జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కారించాలి



తాసిల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

డి. హిరెహాళ్ ఆగస్టు 5 ప్రభాతవార్త

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్స్ డే గా పాటించి తహసిల్దార్ శ్రీనివాసులకు విలేకరులు వినతి పత్రం అందించారు. మంగళవారం డి.హిరెహాళ్ మండలంలోని విలేకరులు ఏపీయుడబ్ల్యుజె పిలుపుమేరకు మండల పరిధిలోని ఆయా జర్నలిస్ట్ యూనియన్లకు చెందిన విలేకరులందరూ ఐకమత్యంతో కమిటీగా ఏర్పడి తాసిల్దార్ కార్యాలయాన్ని చేరుకుని నిరసన చేపట్టి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా అర్హులైన ఇర్నలిస్టులకు నెటికి కొత్త అక్రిడేషన్లు ఇవ్వలేదు. మూడు నెలలకు ఓసారి పొడిగిస్తూ వుంది. ఈ సారి పొడిగించకుండా కొత్త అక్రిడేషన్లు మంజూరు చెయాలని వినత పత్రంలో కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికి మండల కేంద్రంలో ఇంటి పట్టాలు కటాయించి ఇంటి నిర్మాణము ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి. నిబంధనల మేరకు ప్రభుత్వ భూమి డి. పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాలలో అమలులో వున్న విదంగా విలేకరులకు పెన్షన్ విధానం అమలు చేయాలి. ఆరోగ్య భీమ విసతి కల్పించాలి, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన విలేకరుల కమిటీ తహసిల్దార్ తో మాట్లాడుతూ గౌరవ తహశీల్దార్ వారు జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి న్యాయము జరిగిలా చర్యలు చేపట్టాలని కోరుతున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

## రాష్ట్ర సదస్సులో బిపిఎన్ఐ కోఆర్డినేటర్



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం ఆగస్టు 5 ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి ఈనెల 7 వరకు జరుగుతున్న తల్లిపాల విశిష్టత వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరం, గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశానికి బీపీఎన్ఐ రాష్ట్ర కోఆర్డినేటర్, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపర్డెంట్ డాక్టర్ కేశవులు హాజరయ్యారు. 2025 సంవత్సరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల తెలుగు కరపత్రికలను మహిళా శిశు సంక్షేమం, గిరిజనాభివృద్ధి శాఖామాత్యులు గుమ్మడి సంధ్యారాణి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్య కుమారి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతపై విస్తృత అవగాహన ప్రజలు కల్పించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు.

## ఐక్యతతోనే సాధుచెట్టి కులస్తుల అభివృద్ధి

హిందూపురం ఆగస్టు 5 ప్రభాతవార్త



మాజీ ఉప ముఖ్యమంత్రిని కలిసిన మంగేష్



సదస్సులో పురం ప్రతినిధులు

వివిధ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న సాధు చెట్టి కులస్తులు మరింత ఐక్యతతో ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందని, తద్వారా సంఘం అభివృద్ధి సాధిస్తుందని హిందూపురం సాధుచెట్టి సంఘం నాయకులు మంగేష్ పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ పట్టణంలో నూతనంగా కామాక్షి భవన సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించగా హిందూపురంతో పాటు కేరళ, తమిళనాడు, తెలంగాణ మొదలగు ప్రాంతాల నుంచి కులస్తులు భారీగా తరలివచ్చారు. ఈ సదస్సులో కర్ణాటక రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప, స్థానిక ఎంపీ రాఘవేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘం ప్రతినిధులు భాస్కర్, మునిరాజ్, నాగరాజు, శ్రీధర్, సుధాకర్, మార్కెట్ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో రైతులకు అవగాహన

హిందూపురం టౌన్ ఆగస్టు 05 ప్రభాతవార్త



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో సురేంద్ర నాయక్.

ఎల్లం విలంస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం హిందూపురం రూరల్ పరిధిలోని సంతే బిదనూరు, బేవన హళ్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆధ్వర్యంలో మొక్కజొన్న, కంది పంటల్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవపిఎం కిసాన్ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి 7000 నగదు జమ కావడం జరిగింది, దీనికి సంబంధించి ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత, రైతు సేవ కేంద్రం సిబ్బంది చంద్రశేఖర్, శ్రీరాములు, అంజినప్ప, నాగరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డిని కలిసిన వేణురెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో వేణురెడ్డి.

హిందూపురం టౌన్ ఆగస్టు 05 ప్రభాతవార్త

హిందూపురం వైఎస్ఆర్సిపి ముఖ్యనేత గుడ్డంపల్లి వేణు రెడ్డి మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజమండ్రిలోని కేంద్ర కారాగారం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే ఈ సందర్భంగా వేణురెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో మిథున్ రెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన సాధారణ సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బ్రహ్మ సముద్రం ఆగస్టు 5 ప్రభాతవార్త

మండల కేద్రం నందు మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపి పి కంభం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించ డం జరిగింది. ఈ కార్య క్రమం నకు పలువురు సర్పంచులు యంపిటిసిలు ఆయాషాకలకు చెంది న సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో సభ్యులు లేవనెత్తి న సమస్యలకు ఆ యాశకలకు చెందిన అధికారులు సమాధానాలు తెలియ చేస్తు మండలపరిధిలోని అధికారులుమరియు సర్పంచులు ప్రాదేశిక సభ్యులు కృషిచేసి మండల అభివృధి కి సహకారం అందించాలని ఎంపిపి కంభం చంద్రశేఖర్ రెడ్డి సభాముఖంగా వ్యక్తం చేశారు. అనంతరం ఎంపి డి ఓ.రంగనాయకులు ప్రసంగిస్తూ సమావేశానికి హాజరుకాని అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని సభా ముఖంగా తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి కంభం చంద్రశేఖర్ రెడ్డి. వై స్ ఎంపీలు వెంకటేష్ నాయక్. సునంద మ్మ ఎంపీ డి ఓ రంగనాయకులు సర్పంచులు ప్రాదేశిక సభ్యులు. సంబంధిత అధికారులు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే పేరిట ఆలయంలో పూజలు

### ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్న కూటమి నాయకులు



సాయిబాబా మందిరం వద్ద టెంకాయలు కొడుతున్న టిడిపి నాయకులు

కళ్యాణదుర్గం టౌన్ ,ఆగస్టు 05, ప్రభాతవార్త

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలోని సాయిబాబా మందిరంలో మంగళవారం తెలుగు యువత రాష్ట్రకార్యదర్శి కొండాపురం అనిల్‌చౌదరి మిత్రబృందం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సురేంద్ర బాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలు అందించాలని 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆర్డిటి హాస్పిటల్ వద్ద ఎస్ ఆర్ బ్రాండ్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుమారుడు అమిలినేని యశ్వంత్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేసి,సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

### కళ్యాణదుర్గం పట్టణంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

కళ్యాణదుర్గం టౌన్, ఆగస్టు 05, ప్రభాతవార్త



స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ఏపీలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిపిఎం, సిఐటియూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిఈ వి.రాజశేఖర్‌కు పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు .ఈ సందర్భంగా సిపిఎం రాయలసీమ సబ్ కమీటి కన్వీనర్ ఓబులు,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.హెచ్ రాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఆనాడు స్మార్ట్ మీటర్లను ఇంటికి బిగిస్తే పగలగొట్టమని పిలుపునిచ్చిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడంతో పాటు,స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయకుండా వాటిని కొనసాగించ మనడం రాష్ట్ర ప్రజలకి నమ్మకద్రోహం చేయడమే అని అన్నారు. మేము అధికారం లోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం అని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు సంవత్సరంలో 15,485 కోట్ల భారాన్ని సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపారని తెలియజేశా. ఇప్పుడు 12,700కోట్లు భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చును ప్రతి నెల ప్రజలపై అదనంగా బిల్లులతోకలిపి ప్రజలపై భారాన్నివేయడాన్ని తాము సిపిఎం, కార్మిక, కర్షక, రైతు, విద్యార్థి సంఘాలుగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేసి, సర్దుబాటు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షుడు రంగనాథ్, సిఐటియూ నాయకులు వన్నూరుస్వామి, నరేష్, నాగరాజు, అనిల్, వన్నూరప్ప, తిప్పేరుద్ర, నాగన్న, ఆంజినేయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, పరమేష్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పై నన్ను అవమానించారు నాకు న్యాయం చేయండి

### దళితుడు అని చూడకుండా నాపై దుర్భాషలాడారు

### న్యాయం కోసం వస్తే నా పైన దాడి చేశారు

### ఉన్నతాధికారులు స్పందించి ఎస్ ఐ పై చర్యలు తీసుకోండి

బ్రహ్మసముద్రం ఆగస్టు 5 ప్రభాతవార్త



పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

మండలం పరిధిలోని బొబ్బర్లపల్లి గ్రామానికి చెందిన టి సి మారన్న పై బ్రహ్మసముద్రం మండల ఎస్సై నరేంద్ర కుమార్ తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి నన్ను మెడ పట్టుకొని పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టాడని తన కూతురు కేసు విషయమై సోమవారం పోలీస్ స్టేషన్కు పెద్దమనిషిగా వెళ్లిన నన్ను నాపై అసభ్యకర వ్యాఖ్యలు మాట్లాడి నన్ను దూషించి అవమానించాడని తన గోడును రాతపూర్వకంగా రాసి నాపై జరిగిన దాడికి ఉన్నతాధికారులు స్పందించి సదరు ఎస్ఐపై చర్యలుతీసుకోవాలని పత్రికా ముఖంగా తెలియజేశాడు.

## జర్నలిస్టులు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

చెన్నేకొత్తపల్లి, ఆగష్టు 5 ప్రభాతవార్త



తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, డిమాండ్స్ డే సందర్భంగా చెన్నేకొత్తపల్లి మండల పాత్రికేయులు అందరూ కలిసి, మంగళవారం చెన్నేకొత్తపల్లి తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయ్యింది. కాని అర్హులైన జర్నలిస్టులకు నేటికి కొత్త ఆక్రిడేషన్లు ఇవ్వలేదని, మూడు నెలలకు ఒక్క సారి పొడిగిస్తూ రెన్యూవల్ చేసుకుంటు వస్తూనే ఉందని, ఈ సారి పొడిగించకుండా కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలని అన్నారు. అక్రిడిటేషన్లు ఇక పొడిగించవద్దని, తక్షణమే కొత్త కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జర్నలిస్టులకు ఉన్న బీమా సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలి. అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని రిటైర్డ్ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల్లో మాదిరి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు, ఈ కార్యక్రమంలో రామకృష్ణ , మహానంద రెడ్డి , దేవేందర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, నాగేంద్ర, విజయ్‌కుమార్ రెడ్డి, గణేష్ వెంకటరెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 సంవత్సరమునకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలలో ఆర్ట్స్ గ్రూపులలో (సిఇసి, హెచ్ఇసి, ఎంఈసి) అమ్మాయిలకి, బాలురకు (బైపిసి) కాల సముద్రం, కణేకల్, మలుగూరు కళాశాలలో ఖాళీలు కలవని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల డిసిఒ కె.జయలక్ష్మి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## ఈనెల 13 వరకు పంటల బీమా నమోదుకు గడువు పొడగింపు

### -రాయంపల్లి, వ్యాసాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఏవో

ఉరవకొండ, ఆగస్టు 5 ప్రభాతవార్త



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పంటను నమోదు చేస్తున్న దృశ్యం



రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పంటల బీమా నమోదుకు ఈనెల 13వ తేదీ వరకు గడువు పొడగించడం జరిగిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు కోరారు. మండల పరిధిలోని రాయంపల్లి, వ్యాసాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఏవో బి.రామకృష్ణుడు మాట్లాడుతూ ఉరవకొండ మండలంలో ఇప్పటి వరకు 1200 ఎకరాల్లో పంట నమోదు జరిగిందని ఆమిద్యాలలో 42 ఎకరాలు, చిన్నముష్టూరులో 354 ఎకరాలు, లత్తవరంలో 8 ఎకరాలు, నెరమెట్లలో 13 ఎకరాలు, పెద్దకౌకుంట్లలో 204 ఎకరాలు, పెద్ద ముష్టూరులో 539 ఎకరాలు, రాయంపల్లిలో 42 ఎకరాలు, వెలిగొండలో 7 ఎకరాలు నమోదు చేశామన్నారు. ప్రతి రైతు తప్పక పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలుకు భూములు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా సంబంధిత వీఆర్‌వోల వద్దకు వెళ్లి సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అక్టోబర్‌లో నగదు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ పథకం అందుబాటులో ఉందని రైతు మిత్ర గ్రూపులకు డ్రోన్ పథకం వర్తించడం జరుగుతుందన్నారు. దీని పూర్తి ధర 9.80 లక్షల రూపాయలు కాగా రాయితీ 7.80 లక్షలు ఉంటుందని రైతులు 2 లక్షల రూపాయలు కట్టాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు వెంటనే జారీ చేయాలి

### -ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వర్కింగ్ జర్నలిస్టుల వినతి



ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు

ఉరవకొండ, ఆగస్టు 5 ప్రభాతవార్త

పాత అక్రిడిటేషన్ల గడువును ఇకముందు పొడగించకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్లను వెంటనే జారీ చేయాలని ఉరవకొండ నియోజకవర్గ వర్కింగ్ జర్నలిస్టులు కోరారు. రాష్ట్రవ్యాప్త కోర్కెలదినం పాటిస్తూ వర్కింగ్ జర్నలిస్టులు మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వరి క్కింగ్ జర్నలిస్ట్ స (ఏపీయూడబ్లూ య్జే) ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులు కె.ఆనంద్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి వి.రమేష్‌బాబు, సీనియర్ జర్నలిస్టు పి.షేక్షావలి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో అనవసర జాప్యం చేస్తోందన్నారు. అక్రిడిటేషన్లు లేకపోవడంతో జర్నలిస్టులు పలు సదుపాయాలను పొందలేకపోతున్నారని వాపోయారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అక్రిడటేషన్ కమిటీలో జర్నలిస్టుల యూనియన్స్‌కు ప్రాతినిథ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని, స్కీమ్ అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కారానికి ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ఎన్నికల హామీను నిలబెట్టుకోవాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే కోశాధికారి కె.అమరేష్, జర్నలిస్టులు బళ్లారి సాధిక్, ఎ.జగదీష్, ఎర్రిస్వామి, సుధాకర్, వీరేష్‌బాబు, రేగటి భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

చిలమత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త



తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపియుడబ్ల్యుజె) రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు చిలమత్తూరు మండలంలోని పాత్రికేయులు మంగళవారం మండల తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. వృత్తిరీత్యా వచ్చే సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, నివాస స్థలాల కేటాయింపు వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పవన్‌కుమార్, నరసింహారెడ్డి, ఆంజనేయులు, విశ్వనాథ్, సురేంద్ర, బాలు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఒంటి మిద్దె కూలిపోయిన దృశ్యం

### రాత్రి వర్షానికి ఒంటి మిద్దె పూర్తిగా పడిపోయింది

బెలుగుప్ప, ఆగస్టు 5 ప్రభాతవార్త



పడిపోయిన ఒంటి మిద్దె

బెలుగుప్ప మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మల్లేసి సువర్ణ ఒంటి మిద్దె పూర్తిగా పడిపోయిందని ఈ పడిపోయిన మిద్దె 1.20 లక్షలు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. వంట సరుకులు కూడా పూర్తిగా నష్టపోయి, ఉండటానికి ఇల్లు లేదని వెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయంతోపాటు ఇంటిని కూడా నిర్మించి ఇవ్వాలని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

బుక్కరాయసముద్రం, ఆగస్టు 5 ప్రభాతవార్త

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సింగనమల నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి బండి రామకృష్ణ, సహాయ కార్యదర్శి బండారు రామాంజనేయులు, ఆనందు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో విద్యుత్ చార్జీ పేరుతో 15 485 కోట్లు భారం ప్రజలపై మోపిం దన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహ రిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. గత ప్రభుత్వం ఆదానితో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు కొనుగోలించి ఉన్నది, అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఒప్పందాలు అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి కరెంటు చార్జీల పేరుతో మధ్యతరగతి ప్రజలపై భారాలు వేస్తున్నారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించకపోతే స్మార్ట్ మీటర్లు ఒప్పందాలను రద్దు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారితోపా టు రైతు సంఘం మండల కార్యదర్శి వెంకట రాముడు, కౌలు రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, మండల కార్యవర్గ సభ్యులు సుంకన్న, భాస్కర్, రామాంజనేయులు, దండువారిపల్లి భాస్కర్, శ్రీనివాసులు ,పెద్ద తిరుపతయ్య ,సర్దార్, మహిళా సమైక్య నాయకురాలు లక్ష్మీ దేవి, శివమ్మ ,జెసిపి భాష, రసూల్ చాంద్, లక్ష్మీ నారాయణ, మురళి వినయ్ ,కుల్ల యమ్మ, పెద్ద రామాంజనేయులు ,నాగ, టైలర్ రామాంజనేయులు, శ్రీనివాసులు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు



పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

# అక్రమ ఎల్పిజి గ్యాస్ సిలిండర్లు సీజ్ నిల్వ, వ్యాపారాల పై విజిలెన్స్ అధికారుల విస్తృత దాడులు

అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 5 ప్రభాతవార్త

అనంతపురము ఉమ్మడి జిల్లా ప్రాంతీయ నిఘా అధికారి శ్రీ.శి.గి.తి. ప్రసాద్ ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయి జిల్లా, ధర్మవరం టౌన్ నందు రంగ థియేటర్ ప్రక్కన గల చెన్నాదేవి ప్రభ షాపు నందు ఆకస్మిక తనిఖీ చేసి డొమెస్టిక్ , కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వ ఉంచి లిశిబి (ళిళీదీ) ళీళ్లు 2000 చట్ట విరుద్ధముగా వ్యాపారం చేయడం గుర్తించారు. వెంటనే తనిఖీ అధికారులు, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినందుకు మొత్తం 7 , హెచ్ పి. , భారత్ ఎల్పిజీ సిలిండర్లను జప్తు చేసి స్థానిక రెవిన్యూ అధికా రులకు అప్పగించి, సదరు షాపు యజమాని చెన్న దేవి ప్రభ పై ఈసీ యాక్ట్ నమోదు, 1955 సెక్షన్ 6(తి) క్రింద కేసు నమోదు చేశామని. ప్రభుత్వం ద్వారా ప్రజలకు పంపిణీ చేసే ఎల్పిజి సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచడం, వాణిజ్య అవసరాలకు వాడడం మరియు వ్యాపారం చేసే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయని ళిజు ,నివీ శ్రీ.శి.గి.తి. ప్రసాద్ హెచ్చరించారు. తనిఖీల్లో పాల్గొ న్నఎస్సై: వెంకట ప్రసాద్; సి ఎస్ డి టీ: సి. చెన్నకేశవ నాయుడు; వీఆర్వో: పి.బాలకిశోర్ మరియు సిబ్బంది పాల్గొన్నార విజిలెన్స్ అధికారులు తెలియజేశారు.


అక్రమంగా నిర్వహించిన ఎల్పిజి గ్యాస్ సిలిండర్ పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

# ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి - ఏపిజిఇఎ నేతలు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్. సూర్యనారాయణ ఆదేశాల(ఎపిజిఇఎ) రాష్ట్రంలోనే అన్ని జిల్లాల, తాలూకా కార్యవర్గ సభ్యులు తలపెట్టిన రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అన్న కార్యక్రమం అనంతపురం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.గోపి కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలో పంచాయతీరాజ్ ఉద్యోగుల క్యాంటీన్ నందు ఉద్యోగుల సమస్యలపై చర్చించుకొనుట జరిగినది ప్రధానంగా చర్చించిన విషయాలు మనకు ప్రభుత్వం నుండి రావలసిన నాలుగు డిఏలు పిఆర్సి కమిటీని వేయుట (ఐ.ఆర్) మధ్యంతర భృతి కల్పించుటకు ప్రభుత్వాన్ని విన్నవించుట గురించి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వివిధ వర్గాల నుండి సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కార దిశగా ప్రయత్నం చేయుట గురించి చర్చించుటకు గాను సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపికృష్ణతోపాటు జిల్లా కార్యదర్శి ఎస్.రాము నాయక్ సిటీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఎపిజిఇఎ రాష్ట్ర కార్యదర్శి బి.సాంబశివమ్మ, హనుమంతు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, ఆర్గనైజ్ సెక్రెటరీ నాగరాజు, చంద్రశేఖర్, సిటీ బాడీ ప్రెసిడెంట్ రఫీ, సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆయుష్ సుధాకర్, శ్రీనివాసులు, సిటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, పాల్, నగేష్, నాగార్జున, శ్రీనివా సులు, ఈశ్వర య్య, తిమ్మరాజు, జిల్లా పరిషత్ కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొ న్నారు. జిల్లా కార్యవర్గ సభ్యు లు, సిటీ కార్యవర్గ సభ్యులు జిల్లా పరిషత్ నందు పనిచేయు ఉద్యోగులు వివిధ శాఖలకు చెం దిన ఉద్యోగులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఏపిజిఇఎ నేతలు

## అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు - ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు ఇక ప్రతి నెలా 5వ తేదిన మండల పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్ పై రార్యలీలు నిర్వహించాలని ఎంపిడిఓ భాస్కర్ పేర్కొన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం నుంచి గ్రామంలో సచివాలయ ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భాస్కర్ మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకురావడం జరిగిందని, ఒక నెంబర్ ద్వారా 200పైగా సేవలు అందించడం జరుగుతు ందన్నారు. 9552300009 అనే నెంబర్‌పై అవగాహన కల్పించాలన్నారు. మన మిత్ర–వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు సచివాలయ సిబ్బంది కచ్చితంగా అవగాహన కల్పించాలని ఒకవేళ 5వ తేది సెలవు రోజైతే మరుసటి రోజు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపిఓ భాగ్యలక్ష్మి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ, మహిళా పోలీస్ శిల్పా, పంచాయితీ కార్యదర్శి తిప్పేస్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు.


ర్యాలీ చేస్తున్న ఎంఈఓ, సచివాలయ ఉద్యోగులు

## ప్రపంచవ్యాప్తంగా జగన్ నాయకత్వానికి పెరుగుతున్న ఆదరణ

### - వై యస్ జగన్‌ను కలిసిన ఆస్ట్రేలియా, యుకే ఎన్ఆర్ఐలు

.శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని మంగళవారం మరో ఇద్దరు ప్రవాస వైయస్సార్సీపీ నేతలు తాడేపల్లిలో కలిశారు. ఈ సమావేశాన్ని ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి సమన్వయం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా జగన్ నాయకత్వాన్ని విశ్వసిస్తూ పార్టీ బలోపేతానికి తోడుగా నిలుస్తున్న ప్రవాసాంధ్రుల బలాన్ని ఈ సమావేశం మరోసారి చాటిచెప్పింది. వచ్చే ఎన్నికల్లో జగన్ని తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలన్న సంకల్పంతో ప్రపంచంలోని ప్రతి మూల నుండి నేతలు కలిసిపని చేస్తున్నారు. మంగళవారం జగన్‌ను కలిసిన ప్రవాస నాయకులు సూర్యనారాయణ రెడ్డి (కన్వీనర్, ఆస్ట్రేలియా), శ్రీనివాస రెడ్డి (యునైటెడ్ కింగ్‌డమ్). ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డికి ప్రవాసాంధ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో ఆస్ట్రేలియా, యుకే ఎన్ఆర్ఐలు

# కెరీర్ డెవలప్మెంట్ సెల్ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

అనంతపుంర న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

స్థానిక శ్రీ సాయి బాబా జాతీయ డిగ్రీ కళాశాలలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కార్యక్రమం కింద కెరీర్ డెవలప్మెంట్ సెల్ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడినదని ప్రిన్సిపాల్ సరిత ఒక ప్రకట నలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అనంతపురం నోడల్ అధికారి పి.వి.ప్రతాప్ రెడ్డి బృంద సభ్యులు విజయలక్ష్మి ఆవిష్కరణ ఆలోచనల అంతర్దృష్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత ఉత్పాదకంగా మరియు వినూత్నంగా ఆలోచించేలా ప్రోత్స హించడం రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ యొక్క ముఖ్య లక్ష్యమని వక్తలు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం యువతలో ఉత్సా హాన్ని రేకెత్తించింది, సృజనాత్మకత సంస్కృతిని పెంపొందించింది. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది మరియు వి ద్యా ర్థులు మరింత వినూత్న ఆ లోచనల ను అన్వేషిం చడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. విద్యార్థు లలో వినూత్న ఆలోచనల ను ప్రోత్స హించడంలో ఈ కార్యక్ర మం విజయవంతమైంది. ఈ అవగాహన కార్యక్రమంలో సిడి సి కన్వీనర్ డా. కె.పి. వెంక టేశ్వరరావు, సభ్యులు డా.ఎం. బాబా ఫక్రుద్దీన్, ఎస్.శివ ప్రసాద్‌రెడ్డి, ఎం. సురేంద్ర, ఎసిసి ఎఎన్ఓ ఎం.జైను బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఇంటింటికీ బిజెపి సుపరిపాలన కరపత్రాలు పంపిణీ

### - బిజెపి మండల అధ్యక్షులు ఓబిరెడ్డి


కరపత్రాలను పంచుతున్న బిజెపి నేతలు

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఉల్లికల్లు, ఉల్లికంటి పల్లి గ్రామాల్లో బిజెపి మండల అధ్యక్షులు ఓ బిరెడ్డి ఆధ్వర్యంలోమంగళవారం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 11 సం వత్సరాలుగా జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. 2014లో నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్య తలు చేపట్టాక దేశంలోని పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకురా వడం జరిగిందని ప్రతి ఒక్క సంక్షేమ పథకం కింది స్థాయి ప్రజలకు సైతం అందుతున్నాయని, ఎటువంటి మధ్య వర్తులు లేకుండా నేరుగా ప్రజలకే అందేలా కేంద్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబులేసు యాదవ్, మానవతి వెంకటయ్య, మల్లెల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కామయ్య ఎన్నిక

బళ్లారి, ఆగస్టు 5 (ప్రభాత వార్త): హైదరాబాద్‌లోని ప్రగతినగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కామేష్ సిహెచ్, ఉపాధ్యక్షుడిగా నారాయణ రెడ్డి లు ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ఎన్నికైన సభ్యులు జి. కామేశ్వరరావు, పి. వెంకటేశ్వరలు, పి.వి. సీతారామారావు, కె. హరనాథ్ తెలిపారు. సంఘంలోని ఇతర పదవులకు ఎన్నికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రధాన కార్యదర్శి: మోహన్ రావు ఐ.వి., కోశాధికారి: ఆర్.వి. రమణమూర్తి, జాయింట్ సెక్రటరీ: ఎల్. వీర బ్రహ్మాచారి. టి. శ్రీనివాసరావు, ఎ. సత్యనారాయణరావు, కె. హరిప్రసాద్, కె.ఎల్. నరసింహారావు సంఘం కార్యనిర్వాహక సభ్యుడిగా ఎన్నికయ్యారు. సంఘంలోని వివిధ పదవులకు మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మొత్తం 144 మంది అర్హులైన ఓటర్లలో 99 మంది ఈ ఎన్నికల్లో ఓటు వేశారు. అందులో 94 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు అయ్యేవిగా, 05 బ్యాలెట్ పత్రాలు చెల్లనివిగా గుర్తించినట్లు వారు చెప్పారు. ప్రగతి నగర్ సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి తమ అసోసియేషన్ కట్టుబడి ఉంటుందని అసోసి యేషన్ తరపున వివిధ సామాజిక, సంఘసేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని వృద్ధాప్యంలో, విశ్రాంత జీవనంలో ఉన్న సీనియర్ సిటిజెన్ల యోగక్షేమాలు, కష్టనష్టాల్లో ఒకరికొకరు తోడుగా ఉండి పరస్పరం కలుసుకొని ముచ్చటిం చుకుంటూ ఆనందంగా ఉండాలన్నదే తమ అసోసియేషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు.


అధ్యక్షుడిగా ఎన్నికైన కామయ్య

# నా పాట-నీనోట సినీ పాటల సంగీత పోటీలు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి, అనంతపురం వారి ఆధ్వర్యంలో ఆగస్టు 17వ తేది ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్న నాపాట–నీనోట సినీ సంగీత పాటల పోటీలు నగరంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షులు సుగమంచి సురేష్‌బాబు తెలిపారు. గాయనీ గాయకులు అనంతపురం ఉమ్మడి జిల్లాలతోపాటు ఇతర ఏ జిల్లాలకు చెందిన వారైనా పాల్గొనవచ్చని, తమ పేర్లను ఫోన్‌పే నెంబర్ 9985762442కు రూ.1000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వాటితోపాటు రెండు పాటలను ఎంపిక చేసుకొని వాట్సాప్ నెంబరు 9985762442కు పోస్టు చేయాలని తెలిపారు. ఈ నెల 10వ తేది లోపల తమ పేర్లను రిజిస్టర్ చేయించుకొని పోటీలలో పాల్గొనాలని కోరారు. ఏ సినీ గాయకులైనా, పాత పాటలైనా–కొత్తపాటలైనా, డ్యూయెట్‌లైనా సోలో అయినా ఏవైనా ఒక్కొక్కరు రెండు పాటలను ఎంపిక చేసుకొని పంపించాలని కోరారు. అదే రోజు సాయంత్రం బాగా పడి ఎంపికైన గాయనీ గాయకులు 5 మందిని ఎంపిక చేసి వారికి సత్కారం ఉంటుందని, అలాగే ప్రశంసా పత్రాన్ని సైతం అందిస్తామన్నారు. కావున గాయకులు అందరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు అందరినీ ఆహ్వానిస్తున్నామని సర్దార్‌బాబు, ఆదినారాయణ, సూర్యనారాయణరెడ్డి, రమణయ్య, విజయరామయ్య, ఆది, వాళి, పెద్దన్నలు తెలిపారు.

# వర్షంకోసం గాడిదకు పూజలు


గాడిదకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని పెద్దమట్ల గొంది గ్రామంలో మంగళవారం వర్షం కోసం గ్రామస్తులు గాడిద కు పూజలు చేసి భక్తి శ్రద్దలతో గ్రామంలోని పుర వీధుల గుండా గాడిదను ఊరేగిస్తూ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగారైతులు, గ్రామ స్తులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో మూడు రోజుల నుంచి వర్షాలు రావడంతో, గతంలో విరాట పర్వం చదివించడం జరిగిందని, మరుసటి వర్షం పడటంతో గ్రామస్తులలో ఆనందం వెల్లువెత్తింది. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు వర్షం పడకపోవడంతో ఒక గాడిదను తమ గ్రామానికి తెచ్చుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామం అంతా ఊరేగించారు. కచ్చితంగా వరుణ దేవుడు కరుణిస్తాడని తమ పూర్వీకుల నుంచి నమ్మకం అని తాము కూడా ఇదే పద్ధతిని పాటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అభివృద్ధిని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసి వైఎస్ఆర్‌సిపి నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైఎస్ఆర్‌సిపి మాజీ నియోజకవర్గ సమన్వయ కర్త ఎం.వీరాంజి నేయులు పేర్కొన్నారు. మంగల వారం మండల పరిధిలోని ఆకులే డు, లోలూరు, మదురేపల్లి, రఘునాథపురం గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పూల ( ఎ౯ సాా ద౯ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎం.వీరాం జినే యులు, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర నాయకులు తరిమెల వంశీగోకుళ్‌రెడ్డిలు హాజర య్యారు. ఈ సందర్భంగా వారు కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీ లతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను విమర్శి స్తోందని విమర్శించారు. వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టి భయపెట్టినా ఎవరూ భయపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర ప్రజల పక్షాన వైఎస్ఆర్‌సిపి పోరాడుతుందని వారు హెచ్చరించారు. ఈ కా ర్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు మదిరేపల్లి రవీంద్రరెడ్డి, ఆకులేడు రామాంజి నేయులు, నల్లపరెడ్డి, నూర్ మహ్మద్, మైనార్టీ నాయకులు ఆలీ, గురుమూర్తి రెడ్డి, తరిమెల భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బండి శ్రీనివాసులు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


టిడిపి మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న వైసిపి నేతలు


మదిరేపల్లిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యంపై వివరిస్తున్న వైసిపి నేతలు

# ఆగస్టు 8న ఫ్రీడమ్ పార్క్‌లో అంతర్గత రిజర్వేషన్లు జారీకై బృహత్ ప్రతిఘటన

బళ్లారి. ఆగస్టు 5(ప్రభాతవార్త): షెడ్యూల్డ్ కులాలలో మాదిగ సమాజానికి అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని దేశ సుప్రీంకోర్టు ఆదేశించి ఏడాది గడిచినా, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదే పదే కమిషన్లు మరియు కమిటీలను ఏర్పాటు చేస్తూ సమయాన్ని వృధా చేసున్నారు. ఈ నెల 7న జరగనున్న సమావేశంలో అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయా లని నిర్ణయం తీసుకోకపోతే, ఆగస్టు 8న బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌కు వేలాది మంది మాదిగ దండోర కార్యకర్తలు భారీ నిరసన ప్రతిఘటన జరుపుతారని మాదిగ దండోరా రాష్ట్ర కార్యదర్శి ఎ.కె. హులుగప్ప తెలిపారు. మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన జస్టిస్ సదాశివ కమిషన్ మరియు కాంతరాజ్ కమిషన్ ఇచ్చిన నివేదిక నుండి సిఫార్సులు పొందడం ద్వారా రాష్ట్రంలో మాదిగ సమాజానికి అంతర్గత రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా తల్వార్ దుర్గప్ప మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వెనుకబడిన వర్గాల, దళిత అనుకూలు డని, దళితులు, మాదిగలను సంతృప్తి పరచడానికి ప్రయత్ని స్తున్నారని, షెడ్యూల్డ్ కులాలలో మాదిగలకు అంతర్గత రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మాదిగ దండోర కమిటీ జిల్లా అధ్యక్షుడు నెట్టప్ప సంగనకల్లు, వీర స్వామి, చంద్రప్ప, శంకరప్ప, ఎరగుడి సుంకప్ప, జె మల్లికార్జున, డి గంగాధర్ మహంతేష్, శేఖర్ మరియు ఇతర మాదిగ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



పత్రికగోష్టి లో మాట్లాడుతున్న మాదిగ దండోరా రాష్ట్ర సమితి కార్యదర్శి హులుగప్ప

## కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

### -పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలి

### -సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి


మాట్లడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 5 ప్రభాతవార్త

కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ, రాష్ట్రం లో ఉన్న కూటమి ప్రభు త్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి,రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఉరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి అన్నా రు. సోమవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రం లోని శ్రీ వాల్మీకి కళ్యాణమండపంలో సిపిఐ 9వ బుక్కరాయసముద్రం మండల మహాసభలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, సి.మల్లికార్జున సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామక్రిష్ణ,సిపిఐ శింగనమల నియోజకవర్గం కార్యదర్శి టి.నారా యణస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప యాదవ్, ముఖ్యఅతి థులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగ వారు మాటడుతూ రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధర కల్పిం చాలని రైతులకు సకాలంలో పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ,బుక్కరా యసముద్రం మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతి పైన విచారణచేసి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి, బుక్క రాయస ముద్రం పంచియితీ పరిదిలోని కెవిఎస్ నగర్,గిరిప్ర సాద్‌నగర్, వీర భద్రకాల ని,ఐలమ్మకాలకు ఇంటిపట్టాలు ఇచ్చి పక్కాగృహాలు కట్టించాలని ,మండలలో ఉన్న రైతులు,రైతుకూ లీలు, వ్యవసాయ కూలీలు గ్రామీణ ప్రాం త ప్రజల సమస్యల పై చర్చించి ప్రజా పోరాటాలు చేయాలని మహాసభలో చర్చించారు.

## తరిమెలలో బెస్త సేవా సంఘం గ్రామ శాఖ ఏర్పాటు

### - జిల్లా అధ్యక్షులు కెవి.రమణ


మాట్లాడుతున్న బెస్త సంఘం జిల్లా అధ్యక్షులు కెవి.రమణ

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని తరిమెల గ్రామంలో బెస్త సేవా సంఘం గ్రామ కమిటీని ఏర్పాటు చేసి నట్లు బెస్త సంఘం జిల్లా అధ్య క్షులు కెవి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డు తూ.. గ్రామాలలో బెస్తల పరిస్థితి దయనీయంగా ఉందని, రాజకీ య పార్టీలు బెస్తల ఆర్థిక, సామాజిక రాజకీయ ఎదుగుదల కోసం ఏ మాత్రం కృషి చేయకపోగా కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తున్నారని, అందుకే ప్రతి గ్రామంలో సంఘాలు ఏర్పాటు చేసుకుని చైతన్యంతో సమానత్వం కోసం సంఘటితంగాపోరాడాలని పిలు పునిచ్చారు. ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని హక్కుగా భావించి ప్రతి ఒక్కటి అందరికీ అందేలా గ్రామ కమిటీ కృషి చేయాలని తరిమెల గ్రామంలో చెరువులేని కారణంగా పెన్నానది పరివాహక ప్రాంతంలో చేపలు పట్టుకుని జీవించుట కోసం ఫిషర్‌మెన్ లైసెన్సులు సంబంధిత మత్స్యశాఖ నుంచి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంగప్ప, కోశాధి కారి నాగేంద్ర, శింగనమల నియోజకవర్గం అధ్యక్షులు రమేష్, జిల్లా నాయ కులు హరినాథ్, శంకర్, గంగాధర, బెస్త శ్రేష్ఠావలి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిదనవాడ ఏటిగడ్డ పద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు

శింగనమల, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో పెన్నానది ఏటిగడ్డన వెలిసిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారు 5వ వార్షికోత్స వ ఉత్స వాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మ వారికి విశేష పూజాలంకరణ చేసి అనంతరం వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, రాత్రి 8 గంటల నుంచి తెలుగు రాష్ట్రాల తాళం భజన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 25 వేలు, రెండవ బహుమతి 20వేలు, మూడవ బహుమతి 15వేలు మొత్తం 11 బహుమతులు పోటీల్లో గెలుపొందిన వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాజు, గ్రామస్తులు, స్వామివారి భక్తులు, భజన కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో నిద నవాడ ఏటిగడ్డ పెద్దమ్మ తల్లి

## 12 నుంచి ఆశ కార్యకర్తల అహో రాత్రి ప్రతిఘటన

బళ్ళారి, ఆగస్టు 5(ప్రభాత వార్త): డిమాండ్లు పరిష్కరిస్తామన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర్చకపోవడంతో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు జిల్లాస్థాయిలో మూడు రోజులపాటు అహో రాత్రి ప్రతిఘటన చేస్తున్నట్లు ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి డి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక పత్రిక భవన్ లో మంగళవారం పత్రికా గోష్టి లో మాట్లాడుతూ వేతనాలు పెంచాలంటూ సంవత్సరాల తరబడి ఆశా కార్యకర్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ఏమాత్రం పట్టించుకోవడంలేదని దీనిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు పోరాటం చేపడుతున్నట్లు చెప్పారు. వెట్టి చాకిరీ చేస్తూ చాలీచాలని జీతాలతో ఆశా కార్యకర్తల జీవితాలు భారంగా గడుపుతున్నట్లు ప్రభుత్వంతో చావో రేవో తేల్చుకునేందుకే తాము పగలు రాత్రి ఈ ప్రతిఘటన చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు తమ విధులను బహిష్కరించి మూడు రోజులపాటు ఈ ఆందోళనలో పాల్గొంటారని నాగలక్ష్మి చెప్పారు.


పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి డి నాగలక్ష్మి

04ATP05_04ATP05.qxd 05-08-2025 PM 11:17 Page 1



# ఘనంగా అనంతలో జర్నలిస్టుల కోరికల దినోత్సవం

## - జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం ఇచ్చిన ఏపియుడబ్ల్యూజే నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అనం తపురం జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కోరికల దినోత్స వాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. ఏపియుడ బ్ల్యూజే జిల్లా నాయకులు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపియుడ బ్ల్యూజే జిల్లా కమిటీ అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్, ఐజేయు సభ్యులు జి.ప్రభాకర్ నాయుడు, గౌరవాధ్యక్షులు భోగేశ్వర్‌రెడ్డి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు కెపి.కుమార్, పూల చలపతి, బాలరం గారెడ్డి, ఏపియుడబ్ల్యూజే నాయకులు, చౌడప్ప, అక్కులప్ప, బాలమురళీ, దేవిడ్, బెబ్బుల రమేస్‌రెడ్డి, ఆనందవర్ధన్, శేషాద్రి శేఖర్, మల్లేష్, బాల మురళీ, శ్రీనివాసులు, డెక్కన్ క్రానికల్ రమేస్ కాంత్ తదితర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జిల్లాకలెక్టర్‌కు శివనారాయణ శర్మకు ఇచ్చిన వినతిపత్రంలో పలు సమస్యలను విన్నవించారు. తాము అధికారంలోకి వస్తే అందరికీ అక్రిడిటేష న్లు ఇస్తామని కూటమి పార్టీల నేతలు చెప్పారన్నారు. అయితే ఏడాది దాటిన ఇంతవరకు కొత్త అక్రిడిటేషన్ల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. మూడునె లలకు ఒక్క సారి పొడిగిస్తూ పోతూనే ఉన్నారన్నారు. దీంతోజర్న లిస్టులు చాలా మందికి హెల్త్ కార్డు అవకాశం కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రిడిటేషన్లు రెన్యువల్ చేయకుండా కొత్త అక్రిడిటేషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు



జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతిపత్రం ఇస్తున్న ఏపియుడబ్ల్యూజే జిల్లా నాయకులు

ఇంటి స్థలాలు ఇస్తామని మానిఫెస్టో లో పెట్టారని, ఎన్నికల ముందు హడావిడి చేయకుండా ముందుగానే అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రద్దు చేయబడిన యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, బీహార్ రాష్ట్రాల తరహాలో సీనియర్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయండి

పుట్టపర్తి, ఆగస్టు 05, ప్రభాతవార్త

పత్రికా రంగంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రి డేషన్లు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే శ్రీ సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వ ర్యంలో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కు వినతిపత్రం సమర్పించారు. వర్కిం గు జర్నలిస్టుల పెండింగు సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 2025 ఆగస్ట్ 5 వ తేదీన చేపట్టిన "రాష్ట్ర వ్యాప్త డిమాండ్స్ డే" సందర్భంగా ఈ వినతి పత్రాన్ని జిల్లా అధ్యక్షులు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బాబు, ఐజయు కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసులు, రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ మెంబర్ మురళి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు హరికృష్ణ ఆధ్వర్యంలో పాత్రికేయులు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కు కలెక్టర్ చాంబర్లో కలుసుకొని ఈ వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాత అక్రెడిటేషన్ల గడువును ఇక ముందు పొడిగించకుండా, రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలి స్టులందరికీ కొత్త అక్రెడిటేషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి, అక్రెడిటేషన్ కమిటీలలో జర్నలిస్టుల యూనియన్స్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, వర్కింగ్ జర్నలిస్ట్స్ హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా తీర్చిది ద్దాలని డిమాండ్ చేశారు. ఈ స్కీం అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కా రానికి ఒక ద్వైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల న్నారు. వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలనీ,



కలెక్టర్ కు వినతిపత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభు త్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభి ంచాల్సిందిగా వారు కోరారు. అలాగే కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని వర్తిం పజేయడం లేదని, దీనిపై విద్యాసంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తలపాగ చుట్టి ట్రాక్టర్ తోలి రైతులను ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే

## చంద్రన్న సుఖీభవ రైతుల కృతజ్ఞత ర్యాలీ విజయవంతం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, గుండుమల, రాష్ట్ర టిడిపి కార్యదర్శి

అగళి, ఆగస్టు 5 ప్రభాతవార్త

ప్రభుత్వం ఇటీవల ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్‌లో భాగంగా హామీలను నెరవేరుస్తున్నారు. అందులోభాగంగా తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లకు సబ్సిడిలు మహిళల ఖాతాల్లోకి వేయడం, ప్రస్తుతం అన్నదాత సుఖీభవ కింద సంవత్సరానికి రూ.20వేలను రైతుల ఖాతాల్లోకి



అగళి నుంచి తరలిన నాయకులు

జమ చేస్తామని హామీ ఇవ్వగా అందులోభాగంగా మొదటి విడతగా 7వేలు రైతుల ఖాతాల్లోకి జమా అయింది. అన్నదాత సుఖీభవ అంటూ పథకానికి నామకరణం చేశారు. రైతుల ఖాతాల్లోకి డబ్బు జమా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రైతులు కృతజ్ఞత ర్యాలీనిర్వ హించారు. అగళి మండలం నుంచి ట్రాక్టర్లలో రైతులు, నాయకులు ర్యాలీగా వెళ్లి మడకశిర పట్టణంలో ఆంజినే యస్వామి దేవాలయంనుంచి శివాలయం వరకు ర్యాలీ నిర్వహించి వాల్మీకి సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున కార్యక్ర మాన్ని నిర్వహిం చారు. రాష్ట్రం కష్టాల్లో, అప్పులు ఊబిలో ఉన్నాకూడా రైతుల శ్రేయస్సు దృ ష్ట్యా వారి ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ డబ్బులు వేయడం సంతో షంగా ఉందని చంద్రన్న కూడా అన్నదాతల మాదిరిగానే సుఖంగా ఉండాలని రైతు లు సంఘీభావ ర్యాలీ, చంద్రన్న సుఖీభవర్యాలీ నిర్వహించారు. స్వయంగా ఎమ్మెల్యే ర్యాలీలో ట్రాక్టర్‌ను తోలి రైతులు సంతోషపరిచారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర టిడిపిఉపాధ్యక్షులు గుండు మల తిప్పేస్వామి ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి శ్రీనివాస మూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, జడ్పిటిసి ఉమేష్, నాయకులు సింగిల్ విండో అధ్యక్షులు కుమా ర స్వామి, కన్వీ నర్ తిప్పేస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకు మార్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ ఎంపిపి బసవరాజు, నాయకులు రాజ న్న, శివలింగప్ప, షౌకతలి, రాము, గుండా, నందీష్, సునీల్ రం గారెడ్డి, సన్న ప్ప, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అన్నదాతకు వాతలు..సుఖీభవకు కోతలు..!

## - అన్నదాత సుఖీభవ నుండి 7 లక్షల మందికి కోత విధించారు - రైతులను ఆదుకోవడంతో చంద్రబాబు ప్రభుత్వం విఫలం - శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ, ఆగస్టు 5 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసా యం కుదేలైందని అన్నదాతకు వాతలు, సుఖీభవకు కోతలు అన్న చందంగా చంద్రబాబు పాలన కొనసాగుతోందని రాష్ట్ర శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ రూపంలో ఇచ్చిన హామీలను నిలబెట్టు కోలేకపోగా రైతులను మరిన్ని కష్టాలకు గురి చేస్తోందన్నారు. రైతులకు పెట్టు బడి సాయం కింద ఏడాదికి 20వేల రూపాయలు ఇస్తామని జూన్ 2024 నుంచే దీన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం మాటిచ్చి తప్పిం దన్నారు. ఈ రెండు సంవత్స రాలకుగాను ప్రతి రైతుకు 40వేల రూపా య లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 5వేల రూపాయలు మాత్రమే ఇచ్చిం దన్నా రు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది రైతులకు ఈ పథకం నుండి కోత విధించారన్నారు. దీంతో వ్యవసాయానికి పెట్టుబడి కోసం రైతు లు ప్రైవేటు అప్పులపై ఆధారపడే పరిస్థితిని సృష్టించారని ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పండించిన పంటలకు గిట్టు బా టు ధర లభించడంలేదని పంటలను రోడ్డున పడేయాల్సిన పరిస్థితులు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

నెలకొన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులను ఆదుకున్న ధరల స్థిరీకరణ నిధిను ఎత్తివేసి రైతుల ను కష్టాల ఊబి లోకి నెట్టేశారన్నారు. జగన్మో హన్‌రెడ్డి ప్రభు త్వం అమలు చేసిన ఉచిత బీమా పథకాన్ని రద్దు చేసి గత ఏడాది బీమా చెల్లించక పోవడంతో రైతులకు బీమా డబ్బులు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తివేశా రని విమర్శించారు. రైతులకు విత్తనం నుంచి పంట అ మ్మకం వరకూ అండగా ఉన్న ఆర్బీ కేలవ్య వస్థ ను పూర్తిగా నీరుగా రు ‍ఛతున్నారని, గ్రామస్థా యి లో రైతులకు చేదోడు వాదోడుగా ఉన్న వ్యవస్థను ధ్వంసం చేసేశా రన్నా రు. యూరియా కొరతతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఎరు వుల కోసం మళ్లీ క్యూలో నిలబడాల్సి పరిస్థితులను తీసుకొచ్చారన్నారు.

కొందరు వ్యాపా రులు సిండికే ట్‌గా ఏర్పడి రైతులను దోపిడి చేస్తున్నారని అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉందన్నారు. కళ్లముందు కనిపిస్తున్న రైతుల సమస్య లను పరిష్కరించకుండా కక్ష సాధింపు రాజకీయాలు, డైవర్ష న్ పాలి టిక్స్‌కే ప్రభు త్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్య లను పరిష్కరించడం ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిం చకుంటే రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి స్పష్టం చేశారు.

# అధికారులు ఆడిందే ఆట..పాడిందే పాట..!

## ః వెక్కిరిస్తున్న సమయపాలన..వేదిస్తున్న పరిపాలన..!

## ః ఉన్నతాధికారుల ఉదాసీనత..ప్రజలకు తప్పని వెత..!



11.21 గంటలు దాటాక కూడా వెక్కిరిస్తున్న తహసీల్దార్ కుర్చీ



11.20 గంటలకు కూడా అధికారి ఆసనంతో పాటు అపహాస్యం చేస్తున్న సిబ్బంది కుర్చీలు



11.25 గంటలైనా పత్తాలేని పంచాయతీ ఈవో

యాడికి(తాడిపత్రి), ఆగస్టు 5, ప్రభాతవార్తః వారి మేధస్సుకు మెచ్చిన ప్రభుత్వం వారికి ఒక గౌరవ ప్రదమైన హోదాను కల్పించి, ప్రజా సేవ చేస్తున్నందుకు రూ. లక్షలు వేతన రూపంలో చెల్లిస్తూ, తమ కింది స్థాయి సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని, ప్రజల కు జవాబుదారీగా ఉండాలని ఆదేశిం చింది. కానీ క్షేత్రస్థాయి లో ఆ ఆదేశాలు అపహాస్య మవుతు న్నాయి. ఆయా శాఖలకు సారథ్యం వహిస్తున్న మండల స్థాయి అధికారులు ఆడిందే ఆటగా ..పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. సమయపాలనను వెక్కిరిస్తూ పరిపాలనను నిర్లక్ష్యం చేస్తూ జవాబుదారి తనాన్ని గాలికి వదిలేశారు. సారొస్తే చాలు తమ వినతిని వినకపోతారా.. పరిష్కారం చూపకపోతారా అని గంపెడా శతో జనం ఎదురు చూడాల్సి వస్తోంది. ఉద యం 10 గంటలకు కార్యాల యానికి చేరు కొని ప్రజల కష్టాలు తెలు సుకోవలసిన అధికారులు ఏ 11.30 గంటలకో..12 గంటలకో తాపీగా వచ్చి కుర్చీలో కూర్చొని ఒకరిద్దరి సమస్యలు వినేలోగా మధ్యాహ్న భోజన సమ యం ముంచుకు రావడం, ఆ తర్వాత జూమ్ మీటింగ్ అని, సిబ్బందితో సమావేశమని ప్రజలను రేపో మాపో రమ్మని నింపాదిగా చెబుతుంటే పల్లెల నుంచి వచ్చిన జనం పరిష్కారం ఎండమావేనంటూ నిరాశతో వెనుదిరాగల్సి వస్తోంది. ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలకు వెతలు తప్పడం లేదు. ఇక్కడి కార్యాల యాల చుట్టూ కళ్లు తరిగేలా..కాళ్లు అరిగేలా తిరిగిన సమస్యలు పరిష్కారం కావని గ్రహించిన కొందరు బాధితులు జిల్లా కేంద్రం లో నిర్వ హించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పరుగులు తీస్తున్నారు.

మంగళ వారం మండల పరిధిలోని పలు కార్యాలయాల్లో ఆదర్శంగా నిలవాల్సిన మండల స్థాయి అధికారుల స్థానాల వెక్కిరింపులే గాడితప్పిన సమయ పాలనకు నిదర్శనమని చెప్పవచ్చు. ఃమండల పరిధిలోని 14 రెవె న్యూ గ్రామాల ప్రజలకు జవాబుదారిగానూ, ఆయా గ్రామాలకు చెందిన 9 మంది గ్రేడ్-1 రెవెన్యూ అధికారులకు, 16 సచివాలయాల్లోని వీఆర్వోలు, సర్వేయర్లు, 31 మంది వీఆర్ఏలతో పాటు కార్యాలయ సిబ్బందికి ఆదర్శంగా నిలిచి సమయపాలన పాటించాల్సిన మండల స్థాయి అధికారే 11.20 గంటలైనా కార్యాలయానికి రాకపోవడం, పదుల సంఖ్యలో ప్రజలు ఎదురు చూడటం గమనార్హం. ఇక్కడ రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఇటీవల జిల్లా కేంద్రంలోని పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదులు పెరుగుతున్నాయని గణాంకాలు చెబుతుండటం విశేషం.

ః మండల పరిధిలోని 14 పంచాయతీల ప్రజల తాగునీటి వసతి, పారి శుధ్యం పనులు, పలు సంక్షేమ పథకాల అమలుకు జవాబుదారీ తనం చూపాల్సిన మండల స్థాయి అధికారే ఇటీవల తరచూ సమయపాలనను అటకెక్కిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది. 14 పంచాయతీలకు చెందిన ఆరుగురు డీడీవోలు(పంచాయతీ కార్యదర్శులు), 16 సచివాలయాలకు చెందిన దాదాపు 120 మంది సిబ్బందికి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి, యాడికి మేజర్ పంచాయతీ సిబ్బందికి ఆదర్శంగా నిలవాల్సిన అధికారే సమయాన్ని పాటించకపోతే తన కింది స్థాయి సిబ్బందికి జవాబుదారి తనం ఎలా అలవరుస్తారని జనం చర్చించుకుంటున్నారు. ఇటీవల యాడికి మేజర్ పంచాయతీలో నిధులు స్వాహా చేయడం, పిన్నేపల్లి, చింతలాయపల్లి, రాయలచెరువు తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు పెరుగుతుండటం, పింఛన్ల కోతలు, పింఛన్లకు అర్హులైన వారి ఎదురు చూపులు అధికారుల అలసత్వానికి నిదర్శనమనే వాదనలు వినిపిస్తున్నాయి.

ః యాడికి మండలంలో యాడికి పంచాయతీకి ఇటీవల అవినీతి గ్రహణం పట్టింది. నిధుల దుర్వినియోగం, ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో ఇష్టారాజ్యం, పన్నుల వసూళ్లలో చేతివాటం, కార్మికుల వేతనాలకు తరచూ వేచిచూడాల్సి రావడం, కార్మికులకు విధుల అప్పగింతలో మేస్త్రీల ఆధిపత్యం, చెత్తవాహ నాలకు ఇంధన వినియోగంలో ప్రయివేటు పెత్తనం వంటి సమస్యలతో యాడికి పంచాయతీ సతమతమవుతోంది. పంచాయతీ అధికారం ఒక పార్టీకి చెందడం, ప్రభుత్వం మరో పార్టీకి చెందడంతో ఎవరు ఎలాంటి పెత్తనం చేస్తున్నారో తెలియని పరిస్థితి. రెగ్యులర్ ఈవో లేకపోవడంతో పంచాయతీ సమస్యలను పట్టించుకునే నాథుడే కరవయ్యారు. మౌఖికంగా ఈవోఆర్డీకి ఈవోగా బాధ్యతలు అప్పగించారే తప్ప లిఖితపూర్వక ఆదేశాలు లేకపోవడం, ఆమెకు రికార్డులు అప్పగించకపోవడంతో పంచాయతీ పరిపాలన సందిగ్ధంగా మారింది. ఃఆయా శాఖల ఉన్నతాధికారులు తమ ఉదాసీనతను వదిలి మండల స్థాయి అధికారుల్లో జవాబుదారీ తనం నింపాలని మండల వ్యాప్త ప్రజలు కోరుతున్నారు.

# శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పూజలు

అనంతపురం కల్చరల్, ఆగష్టు 5 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని కోర్ట్ రోడ్‌లో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన పుట్టినరోజు సందర్భంగా మంగళవా రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారు లు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే సురేంద్ర బాబును ఆశీర్వదించడం తోపాటు పట్టు శాలవతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ సి ఇన్ఫ్రా డెవలపర్స్ చైర్మన్ యశ్వంత్ చౌదరి, ఇతర ము ఖ్యులు అవినాష్,ధర్మ తేజ, తదితర టిడిపి నాయకులు, ఎమ్మెల్యే సురేం ద్రబాబు సన్నిధిలో పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే సురేంద్రబాబును స్వాగతం పలికారు.





కోర్ట్ రోడ్‌లో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

# రైతన్నలకు ఇచ్చిన హామీల అమలులో అగ్రగన్యుడు సీఎం చంద్రబాబు

## ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

## రైతన్నల ట్రాక్టర్లతో సీఎం చంద్రబాబుకు రైతుల కృతజ్ఞత ర్యాలీ.



ట్రాక్టర్ నడుపుతూ రైతులను ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ ఆగస్టు 5 ప్రభాతవార్త.

రాష్ట్రంలో రైతన్నలకు ఇచ్చిన హామీల అమలులో అగ్ర గన్యుడు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు తెలిపారు.వందలాది ట్రాక్టర్లు తరలివచ్చి మెట్ట బండ ఆంజనేయ స్వామి ఆలయం నుండి వాల్మీకి సర్కిల్ వరకు రైతన్నల ట్రాక్టర్ లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మంగళ వారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మాట్లాడుతూ: అన్నదాత సుఖీభవతో రైతు ఖాతాల్లో 7 వేల రూపాయలు జమ కావడంతో రైతులు కృతజ్ఞతతో సంతోషంతో చంద్రన్న సుఖీభవ అంటూ కృతజ్ఞత ర్యాలీ రైతుల ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున నిర్వహించి తమ కృతజ్ఞతలు ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు వినూత్న రీతిలో వ్యక్త పరచడం విశేషం అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో 5,000 వేల రూపా యలు జమ కావడంతో కృతజ్ఞత భావంతో రైతులు కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. కూతమి ప్రభు త్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఆగస్టు 15 లోపు అమలు చేసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని వారు పేర్కొన్నారు.అభివృద్ధి సంక్షేమ రెండు అమలు చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత మహిళలకు ఉచిత గ్యాస్ సిలిం డర్లు, పెన్షన్ల పెంపు, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ, 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంటి పథకాలు అమలు చేసి సం క్షేమ సారథిగా నిలిచారన్నారు. గతంలో వైసిపి నాయకులు గతంలో చేసిన కుంభ కోణంలో జైలు పాలవుతు న్నారని తాము అభివృద్ధి కార్యక్రమాలు చేప ట్టుతూ ప్రజల్లో మమేకమ వుతు న్నామన్నారు. తాము చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులు అవుతున్న నేపథ్యంలో వాటిని డైవర్షన్ చేయడం కోసమే వైకాపా నేతలు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారని దీనికి ప్రజల్లో స్పందన లేదని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య దర్శి శ్రీనివాస్ మూర్తి,మార్కెట్ యార్డ్ చైర్మన్,జడ్పీటీసీ,అధ్యక్షులు మాజీ ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, వైస్ చైర్మన్లు వెంకట లక్ష్మమ్మ, ప్రభావతి,కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర, ఉమాశంకర్, శ్రీనివా సులు, నాయక్, మేఘన రమేష్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ, మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు,రైతన్నలు,తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేయండి

## జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

పుట్టపర్తి (కలెక్టరేట్), ఆగస్టు 05, ప్రభాతవార్త

ఈనెల 15వ తేదీన 79వ స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర్య దినోత్స వ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారు లను అధికారులను ఆదేశించారు.ఃఆగస్టు 15న స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జరగనున్న వేడుకల సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, బందో బస్తు, పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరే ట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఃఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వ హించే వేడుకల్లో.. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పా ట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశి ంచారు. బారికేడింగ్, వైట్ వాష్ తదితర ఏర్పాట్లను చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతి నిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకల కు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబందిత అధికారులను ఆదేశం చారు. కార్యక్రమానికి హాజరైన వారికి తాగునీటిని సరఫరా, మొబైల్ టాయి లెట్లను ఏర్పాటు చేయాలని పుట్టపర్తి మునిసిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు, ప్రోటోకాల్ అంశాలపై జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నా రు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, జల వన రుల శాఖ, వ్యవసాయము, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, డియం హెచ్ఓ, ఆప్కో, చేనేత, తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి సకటాలను ఏర్పాటు చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశిస్తూ..ఇందుకు డ్వామా పిడి, జి ఎస్ డబ్ల్యూ ఎస్ నోడల్ అధికారులను ఓవర్ అల్ ఇంఛార్జి గా నియమిం చారు. ఉదయం పెరేడ్ మైదానంలో, సాంస్కృతిక కార్యాక్రమాల నిర్వహ ణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డీఈవోను ఆదేశించారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసు కోవాలని ఎస్పీడిసిఎల్ అధికారిని ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగు లకు ప్రశంసా పత్రా లు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు అందించాలని ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్క రణ, పోలీసుల మార్చి ఫాస్ట్‌లో ఎన్ సిసి కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికా రులకు సూచించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా, అత్యంత జాగ్రత్తగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, స్థానిక ఆర్డీవో సువర్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్